# గర్వభంగం

'రాజా'

అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకోగానే సుందరిలో ఒకధీమా ఆవరించింది. తన పొడుగాటి జడలో ఎంత ఆకర్షణీయత ఉంది! తన నల్లటి కనుపాపల్లో ఎంత ధీమా ఉంది! విల్లుల్లాంటి తన కనుబొమలదగ్గిరా, చంద్రబింబంలాంటి తన మొహందగ్గిరా ఏ అజంతాచిత్రాలయినా సరితూగుతాయా?

ఆమెసుందరి. నిజంగానే ఆమెసుందరి అందులో ఏమాత్రం సందేహపడ వలసినది లేదు—ఇలా తియ్యటికలలు కంటోంది సుందరి ఆ అద్దంముందర.

ఆమె మొత్తం ఓ అరగంటసేపు టాయిలెట్ అయి, కనుబొమల్ని చక్కగా పెన్సిల్‌తో దిద్దుకుని, లిప్‌స్టిక్ అంటించి, తలకిపిన్నుబిగించి, తలవెంట్రుకల నొక్కులు సరిదిద్దుకుని, బయటికి వచ్చేసరికి ఆమెకి పోస్టుమాన్ ఒక ఉత్తరం తెచ్చిచ్చాడు.

ఆ ఉత్తరం చక్కగా డిజైన్లు చెక్కబడి ఉంది. ఇండియన్ ఇంక్‌తో దానిమీద ముత్యాల్లాంటి అక్షరాలతో అడ్రసు రాసివుంది,

ఇది చూస్తూనే, ఇది పాత ఫక్కీవుత్తరమేననే వుద్దేశంతో నిర్లక్ష్యంగా ఆమెదాన్ని విప్పింది. అనుకున్నట్టే అది ఒకప్రేమలేఖ. అందులో పెద్దపెద్ద అక్షరాలతో యింతమాత్రమే వ్రాయబడి వుంది.

"నేను నిన్ను ఘోరంగా ప్రేమిస్తున్నాను,

ఇట్లు,

నీ ప్రేమకై

చాతక పక్షిలాఎదురుచూసే

మూర్తి."

ఇలాంటి వుత్తరాలు ఆమెకి క్రొత్తగాదు. ఈ మాటలు ఎన్నోసార్లు ఆమె వినింది. ఎన్నో వుత్తరాల్లో చదివింది "మొగాళ్ళంతా యింతేగావును. ఒక్క చిరునవ్వునవ్వి, కాస్త పలకరిస్తే చాలు అమాంతం ప్రేమలో మునిగిపోతారు; ప్రేమలో తేల్తారు ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోతారు" అనుకుని నవ్వుకుంది సుందరి.

అయితే మొగాళ్లంతా యింతేనా? ఇంతలో చటుక్కున ఆమెకొక ఊహస్ఫురించింది మరి సుధాకర్? ఆ మాటనుకోగానే అతని అందమైన మొహం ఆమెకు ముందు మెదిలింది సుధాకర్ ఈ ప్రేమలన్నిటికంటే దూరంగా వుంటాడు. అతని మంచితనం, మర్యాదా, ధీమా అన్నీ ఆమె మనస్సులో మెదిలాయి అతనుమట్టుకు ఫస్టు సైట్ లోనే ప్రేమలో పడేరకం మనిషి కాదని ఆమె నిశ్చయించుకుంది.

ఆమె సుధాకర్‌ని ఆరునెల్లక్రితమే మొట్టమొదటిసారిగా కలుసుకుంది. అతను ఫిడేలు వాయించేవాడు. అతను వాయించినంతసేపూ ఆమె గుండెలు వేగంగా కొట్టుకునేవి. బహుశా ఆ ఫిడేలుతీగలకీ, ఆమె గుండెకాయకీ 'రెసొనెన్స్' వుండేదేమో!

అతను ఫిడేలు వాయించినంతసేపూ సుందరి తనురెప్పవెయ్యకుండా అల్లానేచూస్తూండేది. అలా చూస్తున్నంతసేపూ ఆమె నొకవిభ్రమైన ఆవేశం ఆవహించేది. చిట్టచివరకి ఎల్లాఅయితేనేం, "ఇతనెవరో కనుక్కునేదాకా నిద్రపట్టదు," అనుకుని, తన్నిమిత్తమైన పరిశోధనలో నిమగ్నమయింది.

సుధాకర్ మితభాషి; అతను ఇంగ్లాండుకువెళ్లి యింజనీరింగ్‌లో పెద్దపరీక్షలు ప్యాసైవచ్చినా

కూడా ఏమాత్రం గర్వంవున్నట్టే కనిపించేవాడు గాదు. వీలైనప్పుడల్లా నలుగురూ అడిగిన వెంటనే వయొలిన్ వాయించేవాడు. అతను పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో ఛీఫ్ ఇంజనీరుగా నియమింప బడ్డాడని ఆమె తెలుసుకుంది.

అయితే సుధాకర్‌ని కలుసుకునే దేలాగ? సుధాకర్ అక్కడ ఒక క్లబ్బులో చేరాడని తెలుసుకుని తానూ అక్కడ నెంబరుగా చేరింది. అక్కడ ఆమె అతిముఖ్యమయిన ఆచోకీతీసింది. అతను ఇంకా పెళ్ళాడలేదుట.

ఇంతవరకూ ఆమె అనేక మొగాళ్ళని తన వెంట తిప్పుకుంది. కాని యిప్పుడామె సుధాకర్ వెంటబడింది. క్లబ్బులో ఏదో విధంగా అతని ప్రక్కసీటు సంపాదించడం; అతను ఏమన్నా కూడా నవ్వుతూవుండడం చేసి ఏగాగయినా అతని దృష్టిపథంలో పడదామని నానా ప్రయత్నాలుచేసేది సుధాకర్ ఎక్కడికెళ్లినా,ఏవిందుకెళ్లినా అక్కడహాజర్ సుందరి. సినిమాల్లో అతని ప్రక్కనేకూర్చునేది. సుధాకర్‌కి యిష్టమైన పిక్చర్ అయితే ఆకాశానికెత్తేసేది.సుధాకర్‌కి యిష్టంలేకపోతే దాన్నిదారి పొడుగూతా తిట్టడమే సుందరి!

కాని యింతకీ సుధాకర్‌లో మార్పేమీ కనిపించలేదు. దానిక్కారణం తలపీక్కున్నా సుందరికి బోధపడటంలేదు. పెళ్లిచేసుకుంటానని చెప్పకపోతే అధమంరెండు తియ్యని మాటలైనా చెప్పకూడదూ? ఈ పరిస్థితిలో మూర్తి ఉంటే ఏంచేస్తాడు? రెండుదస్తాల కాగితాలమీద ప్రేమ కవిత్వం ఒలికించి, ప్రచురించకపోతాడా?

ఆమెకొక ఆలోచన తట్టింది. తానంతముందు ఎంతెంతమందినో నిరాశపరుస్తూవచ్చింది. బహుశా యితనుకూడా అదే ఉద్దేశంతో భయపడుతూ ఉండివుంటాడు. తాను ప్రేమిస్తున్నానని అతనితో ఒక్కమాట చెప్పితే ఎంతోబాగుండును. ఈ తెలివితక్కువ పనిచేసినందుకు తనని తాను నిందించుకుంది సుందరి.

ఈ నిశ్చయానికి వచ్చాక ఆమె కొత్తగా కొనుక్కున్న జార్జెట్ సిల్కుచీర ధరించి, యథాప్రకారం టాయిలెట్ అయి, బయలుదేరింది తనకార్లో.

* * *

అలావెళ్లడం వెళ్లడం తిన్నగా సుధాకర్ యింటికి వట్టించింది తనకారుని. అదొకపెద్దబంగళా సుధాకర్‌తల్లి సావిడిలో కూర్చుని, కళ్లద్దాలుపెట్టుకొని తెలుగుపేపరు చదువుకొంటోంది సుందరిని చూడగానే ఆమెలేచి సుందరిని సోఫాలో కూర్చోబెట్టి, తనుకూడా ఆమెప్రక్కనే కూర్చుంది.

సుధాకర్ తల్లినిచూసి సుందరి చాలా సంతోషించింది. యిలాంటి అత్తగారు తనకుంటే ఎంత బాగుంటుందో నని ఊహించుకుంది. ఆవిడజుట్టు నెరిసినా పాతకాలపు వాళ్ల పక్కిలోలేదు ఆవిడ తియ్యటి కబుర్లు వింటున్నకొద్దీ యింకావినాలని ఉంది సుందరికి.

"సుధాకర్ యింట్లోలేదు. నీకొకమంచి శుభ వర్తమానం ఒకటి చెబుతాను."

"ఏమిటండి అది?" ఆశగాచూసిందిసుందరి.

"సుధాకర్‌కి పెళ్లినిశ్చయమయింది. పెళ్లికూతురికి ఎలాంటి చీరలు ఇమ్మంటావో చెప్పకాస్త. నేను ముసలిదాన్నిగదా? ఈ కాలపు ఫ్యాషన్లేవో నీకు తెలియాలి. నాక్కాస్తసలహాయియ్యి యిందులో. నేనుకొన్న చీరలుతెస్తాను. ఇప్పుడేచూద్దుగాని." అనిచెప్పేసి, జవాబుకోసం ఎదురుచూడకుండా లోపలికివెళ్లింది సుధాకర్‌తల్లి.

ఇదివిన్న సుందరి గుండెల్లో పిడుగుపడ్డట యింది. ఇది తానెన్నడూ అనుకోనిదెబ్బ. ఈ అవమానం భరించరానిది. సుందరి కళ్లమ్మట అశ్రువులుకారాయి. యింతట్లోకే సుధాకర్‌తల్లి ప్రవేశించింది చీరలతోటి. బెనారస్ చీరలూ, బెంగుళూరుచీరలూ అన్నీ చూపించింది సుందరికి.

లోపల ఉడుకుమోత్తనం ఆవేశిస్తున్నా, "చాలాబాగున్నాయ్," అని ఏలాగో అనగలిగింది సుందరి.

"పిల్లకి ఇవి తప్పకుండా నచ్చుతాయి కాదూ?" అని అడిగింది సుధాకర్ తల్లి. ఆవిడకి సుందరి హృదయంలో రేగుతున్న తుపానువంక ధ్యాసే లేదు.

"ఓ. అందులో ఏమీ సందేహంలేదు. సరేగాని పిల్లతెల్లగావుంటుందామరి? అలాగయితేనే ఈ చీర నరిపోతుంది." అందిసుందరి. తనని మించిన అందంఉంది. సుధాకర్‌నాకర్షించిన ఆస్త్రీ ఎవరో? లోపల్లోపల ఆస్త్రీని తిట్టుకుంది. ఆస్త్రీనల్ల కొరివిమొద్దులాగ ఉండాలని కోరుకుంది.

"దానికేమమ్మా! బంగారుబొమ్మలా వుంటుందిట" సుధాకర్‌చెప్పాడు. ఆఅమ్మాయి ఎవరని అడిగితే, తర్వాతనీకే తెలుస్తుంది తినబోతూ, రుచెందుకుఅన్నాడు."

సుందరికి గుండె కుదుటబడింది. ఇంకానిశ్చయంకాలేదుగదా!

"ఏమిటమ్మా, నేనుచెప్పిన వన్నీ మాటకి మాటా వప్పగిస్తున్నావు?" అంటూ ప్రవేశించాడు సుధాకర్. సుందరి ఆతన్నిచూసింది. అబ్బ! ఏమిటాఅందం! అతన్నించి ఆమె దృష్టి మరల్చుకోలేక పోతోంది,

సుధాకర్ ఆమెతో "నేను పెళ్ళి చేసుకుంటానని చెప్పిందగ్గిర్నించి మాఅమ్మకి మరోప్రసక్తే లేదు." అన్నాడు

ఇదివిన్న సుందరికి ఇంకాస్త ధైర్యంవచ్చింది

"అంతకంటే నాక్కావల్సిందేముంది నువ్వు చెప్పమ్మాయి! ఇన్నాళ్ళకి తనకితానై పెళ్ళిచేసుకుంటానని చెపుతూంటే!" అందితల్లి,

సుందరి చిరునవ్వునవ్వింది.

"అమ్మా నాకేమన్నా తిండానికియ్యి నాకు చెడ్డ ఆకలిగా ఉంది. సుందరిక్కూడా ఆకలిగా వుండి వుంటుంది," అన్నాడు సుధాకర్ పెళ్ళి విషయం మార్చేందుకు ప్రయత్నిస్తూ,

"అయ్యో నాతెలివికాలా ఆ సంగతే మర్చిపోయాను. కాస్త టిఫినూ కాఫీ తెస్తా యిప్పుడే" అని ఆవిడ లోపలికి పరిగెత్తింది.

ఒంటరిగా మాట్లాడ్డానికి అవకాశం చిక్కింది గదా అని సుందరి సంతోషించింది.

"మా అమ్మ 24 గంటలూ ఏదో ఒకటి తినమంటుంది" అన్నాడు సుధాకర్. కాని సుందరి నవ్వకపోవడం చూసి "ఏం సుందరీ ఏమిటి సంగతి?" అని అడిగాడు.

ఆమె అతని కళ్ళల్లోకి తిన్నగాచూస్తూ 'నేను మీతో మాట్లాడ వలసివుంది' అంది.

"దేన్ని గురించి?" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకర్.

"మీరు నిజంగా పెళ్ళిచేసుకోబోతున్నారా?"

"అవును. ఆసంగతే అనుకుంటున్నాను''

సుందరి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఆమె అతన్ని అంతగా ప్రేమిస్తే అతనింకొకదాన్ని పెళ్ళి చేసుకుంటున్నాడు. వీల్లేదు- అతన్ని చేసుకోనియ్యకూడదు.

"మీరింకా తెలుసుకోలేదూ?"

"ఏమిటి ? "

"నేను మిమ్మల్నెంతగా ప్రేమించానో మీరింకా గుర్తించలేదూ?''

ఒక్కక్షణం నిశ్శబ్దం.

సుధాకర్ నవ్వుతూ "మీరే యిలా అంటే మీ యితర ప్రియులు ఏం చేశేవారో?''అన్నాడు.

అతను దీన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోకపోడంచూస్తే ఆమె కంతకంతకి ఒళ్ళుమండుతోంది. చివ్వరికి కూడదీసుకుని అంది "అయితే మీరునన్ను ప్రేమించటం లేదన్నమాట."

"ఎంతమాట! మీరుచాలా అందంగావున్నారు, తప్పకుండా మిమ్మల్ని ప్రేమిస్తాను"

"అయితే మీరు ఇంకోదాన్నెవత్తినో పెళ్ళి చేసుకోవడమేం? ఆమె నా కంటే అందంగా వుంటుందా?''

ఆమెకి ఆ స్త్రీ మీద మహా ఈర్ష్యగా వుంది.

"మీకంటే ఎక్కువ అందంగా లేదు, కాని మీరు కేవలం దేవతలాంటివాళ్ళు. అలాగే మిమ్మల్నిచూస్తాను, కాని నేను పెళ్ళిచేసుకో బోయేది యువతి; అంటే నావుద్దేశం కాస్త అణకువా సౌశీల్యం వున్నది"

ఆమె కింతవరకూ అతనిమీదవున్న ప్రేమంతా క్రోధంకింద మారిపోయింది. ఆమెజీవితంలో

తిరస్కరించ బడడం యిదే మొదటిసారి. యిది ఆమెకి భరించరాని దెబ్బ! దీనికంతటికీ కారకుడు సుధాకర్ !

"నీ అంత మోసగాడు ప్రపంచంలో ఎవడూ లేడు. అయితే నన్నింతకాలం ప్రేమిస్తున్నట్టు ఎందుకు వంచించావు?" అంది అభిమానంతో సుందరి.

"నేనెన్నడూ అలాగ ప్రవర్తించలేదే!" అని ముక్తసరిగా జవాబు చెప్పాడు సుధాకర్.

"నువ్వు ద్రోహివి! హంతకుడివి!" ఆమె అతన్ని బాధించ డానికి మాటలు వెదకసాగింది. కాని ఆమెకి కనిపించలేదు అంచేత ఆమె ఇంక ఒక్కక్షణంకూడా అక్కడ నిలవక బయటికి వెళ్ళిపోయింది. ఆమె అమాయకత్వానికి సుధాకర్ నవ్వుకున్నాడు.

* * *

సుందరి తిన్నగా వెళ్లి తన పరుపుమీద పడుకుంచి ఆమెకోపం చల్లారిపోయి బాధా, లజ్జా ఆవరించాయి. ఆమెయింతవరకూ చెప్పిన మాటలన్నీ ఆమెని ఎత్తిపొడవడం ఆరంభించాయి. అభిమానంతోనూ; అసహాయతతోనూ ఆమె పరుపులో తలదూర్చి వెక్కివెక్కి ఏడ్వటం ఆరంభించింది.

సుందరి తనని తానే తిట్టుకుంది. "ఛీ, నేనెంత తెలివిమాలిన దాన్నై ప్రవర్తించానో నేను కాస్త తియ్యతియ్యటి మాటలు చెప్పి మెల్లి మెల్లిగా అతణ్ణి నావాణ్ణిగా చేసుకుని వుండొచ్చు. విపర్కారణంగా అనరాని మాటలన్నాను. నేనింత వరకూ చేసినవన్నీ తుడిచిపెట్టుకుపోతే ఎంత బాగుండిపోను!" అనుకుంది.

అతడు బహుశా తనని చూసి నవ్వుతూ వుంటాడు. ఈ ఊహ ఆమెకి రాగానే ఆమెకు ఎదురుగా అతను నవ్వుతూన్నట్టు కనిపించాడు. ఆమె క్రోధంతో ఆ ఊహని పారదోలుకుంది. "నేను ప్రేమిస్తున్నాను" అని తాను అతనితో అంత స్పష్టంగా చెప్పినందుకు తనని తాను నిందించుకుంది.

అనేక ఊహలు ఆమెమనస్సులో పరిగెత్తాయి "అతనికి పెళ్లి అవుతుంది. నాకింకా అప్పటికి పెళ్ళి కాకపోతే అతనేమను కుంటాడు? తను తిరస్కరించడం మూలాన్నే నాకు పెళ్లికాలేదని అనుకోడూ?"

ఈ ఊహల్ని ఆమె భరించలేక పోయింది. "అయితే ఇప్పుడేమి కర్తవ్యం? అతని పెళ్లికి ముందే నాకు పెళ్లి అయిపోవాలి. అలాఅయితే నాకపి తీర్చుకోవచ్చు" అనే నిశ్చయానికివచ్చింది

తనకి ప్రేమలేఖల్లో కావ్యాన్ని అందజేసిన మూర్తినే పెళ్లాడితే? ఛీ, అతను వొట్టిమూర్ఖుడు. అల్లాంటివాణ్ణా పెళ్లాడ్డం!

ఆమె ముందు సుధాకర్ అందమైన మొహం కనిపించింది. ఆమె కష్టంమీద ఆ ఊహల్ని పారదోలుకుంది.

ఆమె వెంటనే కారెక్కి మూర్తి యింటికి బయలుదేరింది. మూర్తివెంటనే ఆహ్వానించి, "మిమ్మల్నిపిలవాలనే అనుకుంటున్నాను. వెదక బోయిన తీగ కాళ్లకి తగిలినట్టు మీరేవచ్చారు. నేనొకఅమ్మాయిని రేపు పెళ్లి చేసుకోబోతున్నాను. ఆ అమ్మాయిని నేను ప్రేమించలేదు. మనలోమనమాట—ఆ అమ్మాయిని తప్ప యింకెవర్నీ చేసుకోడానికి వీల్లేదంటున్నారు మావాళ్లు. కాని నా మనసులో మట్టుకు ఎప్పుడూ మీసుందర ముఖారవిందం........

సుందరి కాళ్లక్రింద భూమి తిరిగి పోతున్నట్టు అనిపించింది. ఆమె అతని ఆఖరివాక్యం పూర్తి కాకముందే "చాలాసంతోషం నాకుచాలా అర్జంటుపనివుంది" అనిచెప్పి వెంటనే కారెక్కి మళ్లా ఇంటికి బయలుదేరింది, తనవాక్యం పూర్తికాకుండా ఎందుకలా వెళ్లిపోయిందా అని మూర్తి ఆమె కారువంక ఆశ్చర్యంగా చూశాడు.

తనకితానై వలపు చూపిస్తే యిదేగా మగాళ్ల చుల్కన? ఆమె అభిమానం కట్టలుతెగి ఆమె పరుపుమీద ధారాపాతంగా ఏడ్చింది

ఆమె కిప్పుడెవరున్నారు? ఈ దుఃఖంఎవరితో చెప్పుకోడం? సుధాకర్ మాటలు ఆమెకువినిపించాయి. "నువ్వు దేవతవి. నేను యువతిని పెళ్లి చేసుకోబోతున్నాను." అని ....

అలా ఆమె ఎంతసేపు ఏడ్చిందో, రెండుచల్లనిచేతులు ఆమెని లేవనెత్తాయి. ఆమె కళ్లుతుడుచుకుని చూసింది, సుధాకర్ !!!

సుధాకర్ ఆమెని హత్తుకుని, "సుందరీ నువ్వొక అయోమయ యువతివి!" అన్నాడు.